క్లుప్తంగా

నెట్టికంటుడికి రూ.లక్ష విరాళం


ఆలయ సిబ్బందికి చెక్కు అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: అనంతపురం నగరానికి చెందిన డి.అశోక్ కుమార్ అనే భక్తుడు శనివారం కుటుంబ సభ్యులతో కలిసి కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామివారికి రూ.లక్ష విరాళాన్ని చెక్కు రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా అర్చకులు దాతల పేరున ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి తీర్థ ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

'దళిత ఉద్యోగులను దూషిస్తే సహించేది లేదు'

శింగనమల: దళిత ఉద్యోగులను అసభ్యకరంగా దూషిస్తే సహించేది లేదంటూ ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి మండిపడ్డారు. శనివారం శింగనమలలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శింగనమల వెలుగు కార్యాలయంలో సీసీ పని చేస్తున్న దళిత మహిళ ఉద్యోగి పట్ల దుర్భాషలాడిన నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఆదినారాయణపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. వెలుగు సీసీగా విధులు నిర్వహిస్తున్న దళిత మహిళ ఉద్యోగిపై అసభ్యకరంగా దూషించిన ఆదినారాయణపై శింగనమల పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వంలో ఉద్యోగులకే భద్రత లేకుండా పోతోందన్నారు. దళిత, గిరిజన ఉద్యోగులపై జరుగుతున్నటువంటి వేధింపులు, వివక్షతను అరికట్టాలని జిల్లా ఎస్పీని కోరుతామన్నారు. ఈసమావేశంలో జేఏసీ నాయకులు కొర్రపాడు నాగేంద్ర, రామకృష్ణ, వెంకటేసు, గోపాలు, బాబు, రాము తదితరులు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన అవసరం


గార్లదిన్నె మండలం కొప్పలకొండలో అవగాహన కల్పిస్తున్న జడ్జి నిర్మల



పెద్దవడుగూరులో మాట్లాడుతున్న గుత్తి సీనియర్ సివిల్ జడ్జి కాశీవిశ్వనాథ ఆచారి

గార్లదిన్నె: పోక్సో చట్టంపై అవగాహన అవసరమని అసిస్టెంట్ సెషన్ జడ్జి నిర్మల అన్నారు. శనివారం మండలంలోని కొప్పలకొండలో న్యాయ విజ్ఞాన సదస్సు ఆధ్వర్యంలో ప్రజలకు పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. జడ్జి మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు బాలికలు అపరిచిత వ్యక్తుల పట్ల ఆకర్షితులు కాకుండా జాగ్రత్త వహించాలన్నారు. అలాగే బాలికలపై లైంగిక వేధింపులు, లైంగిక నేరాల నుంచి రక్షణ కల్పించేందుకు భారత ప్రభుత్వం పోక్సో చట్టం తీసుకువచ్చిందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఈరమ్మ, ఎంపీడీఓ యోగానందరెడ్డి ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా, ఏపీఎం మల్లికార్జున, మహిళ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో శనివారం గుత్తి న్యాయ సేవా సమితి ఆధ్వర్యంలో సీనియర్ సివిల్ జడ్జి కాశీ విశ్వనాథ ఆచారి బాలలపై లైగింక నిరోధక చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బాలలపై ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. అనంతరం పోక్సో చట్టం గురించి వివరించారు. కార్యక్రమంలో ప్యానెల్ అడ్వకేట్ గంగధార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో తప్పుల సవరణపై దృష్టి పెట్టండి

పెద్దవడుగూరు: బీఎల్ఓలు ఓటర్ జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా చూసుకోవాలని తహసీల్దార్ ఉషారాణి సూచించారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్ఓలతో సమావేశం నిర్వహించారు.

బీఎల్ఓలతో సమావేశం

తాడిపత్రిటౌన్ (యాడికి) : యాడికి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం తహశీల్దార్ ప్రతాప్‌రెడ్డి బూత్ లెవల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలన్నారు. అలాగే ఓటరు నమోదు, మార్పులు, చేర్పులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బూత్ లెవల్ అధికారులు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన కలిగిఉండాలి

శింగనమల: ప్రతి ఒక్కరూ హెచ్ఐవీపై అవగాహన కలిగి ఉండాలని శింగనమల సీహెచ్‌సీ వైద్యులు తెలిపారు. శనివారం శింగనమల సీహెచ్‌సీలో ఐఈసీ పోస్టరు విడుదల చేశారు. వైద్యులు చంద్రకళ, ప్రవీణ్ మాట్లాడుతూ హెచ్ఐవీ ఎలా వస్తుంది? రాకుండా తీసుకోవాల్సిన చర్యలు, వచ్చిన వారు ఎలాంటి చర్యలు తీసుకోవాలో వివరించారు. హెచ్ఐవీ రోగుల పట్ల వివక్షత చూపవద్దన్నారు. ఐసీటీసీ కౌన్సిలర్ వెంకటపతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హెచ్ఐవీ పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీరంగనాయకులు, ఆంజనేయులు, పుష్పలత, సిబ్బంది వరలక్ష్మి, వహీదా, పార్వతి, జ్యోష్న, గీతాదేవి, ఉమాదేవి, రమేష్, విజయ్ పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ పకడ్బందీగా నిర్వహించండి

గుత్తి రూరల్: మండలంలోని 24 గ్రామ పంచాయతీలలో 2023–24లో జరిగిన ఉపాధి పనుల్లో అవినీతిని వెలికితీసేందుకు గ్రామాల్లో సామాజిక తనిఖీలు పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్, స్టేట్ రిసోర్స్ పర్సన్ చంద్రమోహన్, ఏపీఓ మద్దిలేటి ఆదేశించారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం సామాజిక తనిఖీ బృందం సభ్యులతో వారు సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకూ గుత్తి మండలంలోని 24 గ్రామ పంచాయతీలలో జరిగిన ఉపాధి హామీ పనులు, పింఛన్, ఇతర లబ్ధికి సంబంధించి గ్రామాల్లోని ప్రతి ఇంటికీ వెళ్లి విచారణ చేయాలన్నారు. ఎవరైనా అక్రమంగా బిల్లులు చేసుకుని ఉంటే రికవరీ చేయాలన్నారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ మల్లేష్‌నాయక్, డీఆర్‌పీలు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

భూగర్భ జలాలు పెంపొందించడమే లక్ష్యం


గుంతకల్లు మండలం దోనిముక్కలలో ఫారంపాండ్ తవ్వకం ప్రారంభిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్/గుంతకల్లు టౌన్/గుత్తిరూరల్/పామిడి/పుట్లూరు: భూగర్భజలాలను పెంపొందించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎల్‌డీఓ విజయలక్ష్మి సూచించారు. ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మండలంలోని దోనిముక్కల గ్రామంలో ఫారంపాండ్ల తవ్వకాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో భూమిపూజ చేసి ఫారంపాండ్ల తవ్వకాలను ప్రారంభించారు. డీఎల్‌డీఓ మాట్లాడుతూ భూగర్భజలాలు రోజురోజుకూ తరగిపోయి నీటి కష్టాలు పెరిగిపోతున్న తరుణంలో వర్షపు నీటిని ఒడిసిపట్టుకొని భూగర్భ జలాలను పెంపొందించే బాధ్యత ప్రతి ఒక్కరి పైనా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ నీటిని వృథా చేయకుండా పొలాల్లో ఫారంపాండ్లు తవ్వుకోవడంతోపాటు, ఇళ్లముందు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎంపీపీ బీవీ మాధవి, ఎంపీడీఓ శ్రీకాంత్ చౌదరి, అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

▸ గుంతకల్లులోని ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య, వైస్ ప్రిన్సిపాల్ రవిశంకర్ శర్మ, ఎన్‌సీసీ అధికారి బాలకృష్ణ, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎన్‌సీసీ విద్యార్థులు మున్సిపల్ రిజర్వాయర్లలోని ప్లాస్టిక్ కవర్లు, జంబుగడ్డి తొలగించారు.

▸ గుత్తి మండలంలోని ఊబిచెర్ల గ్రామంలో జల దినోత్సవం సందర్భంగా ఫారంపాండ్ల నిర్మాణానికి ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్ శనివారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఏపీఓ మద్దిలేటి, ఈసీ ఈశ్వర్‌రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ రత్నాలు, ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

▸ పామిడి మండలంలోని సొరకాయలపేట గ్రామంలో శనివారం జాతీయ జల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సర్పంచ్ మూలి నాగేశ్వర్‌రెడ్డి సారథ్యంలో గ్రామంలో ఫారమ్‌ఫాండ్స్ ఏర్పాటుకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఏపీఓ మల్లీశ్వరి, ఉపాధికూలీలు, కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.

▸ పుట్లూరు మండలంలోని నాయకునిపల్లి గ్రామ సమీపంలో జల దినోత్సవం సందర్భంగా శనివారం ఉపాధి పథకం కింద సేద్యపునీటి కుంట తవ్వకం పనులను ఎంపీడీఓ అలివేలమ్మ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఓబులేసు, ఏపీఓ నరేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

నైపుణ్యాలుంటే ఉద్యోగాలు


అధ్యాపకులు, విద్యార్థులతో టాటా ఎలెక్స్ బృందం

బుక్కరాయసముద్రం: నైపుణ్యాలు కలిగి ఉంటే ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉద్యోగాలు తప్పనిసరిగా లభిస్తాయని ఎస్‌ఆర్ఐటీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ అన్నారు. శనివారం మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో టాటా ఎలెక్స్ వారి సహకారంతో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు మాక్ ఇంటర్వ్యూలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టాటా ఎలెక్స్ నుంచి 45 మంది సభ్యుల బృందం ఎస్ఆర్ఐటీ క్యాంపస్‌ను సందర్శించి 400 మంది విద్యార్థులకు పైగా వన్-ఆన్-వన్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. టాటా ఎలెక్స్ బృందాన్ని కళాశాల కరస్పాండెంట్ ఆలూరి సాంబశివారెడ్డి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రంజిత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ తదితరులు అభినందించారు.

సంక్షిప్త సమాచారం

27న వైస్ ఎంపీపీ–2 ఎన్నికలు

యల్లనూరు: యల్లనూరు మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 27న ఖాళీగా ఉన్న వైస్ ఎంపీపీ -2 (ఉపాధ్యక్షుడు) పదవికి ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి , ఎంపీడీఓ వాసుదేవరెడ్డి శనివారం తెలిపారు. వైస్ ఎంపీపీ–2 రంగయ్య ఇటీవల గుండెపోటుతో మృతిచెందడంతో.. ఆ స్థానానికి ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. ఎంపీటీసీలు హాజరు కావాలని ఆయన సూచించారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

గుంతకల్లుటౌన్: పట్టణంలోని 25వ వార్డులో రూ.10 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణానికి శనివారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎస్.భవాని భూమిపూజ చేశారు. రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, నిర్ణీత వ్యవధిలోగా పనులను పూర్తి చేయాలని ఆమె కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అరుణ, ఎమ్మెల్యే సోదరుడు నారాయణస్వామి, కమిషనర్ నయిమ్ అహ్మద్, ఎంఈ లీలాకృష్ణప్రసాద్, కౌన్సిలర్ కృపాకర్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

తాడిపత్రి రూరల్: పట్టణంలోని నంద్యాల రోడ్‌లోని ఆర్‌కే కాంప్లెక్స్ వద్ద శనివారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని రైతు సంఘం నాయకుడు రాజారామిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో శిరీష, కవిత, హరి, రాజా, ఐస్ వంశీ తదితరులు పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు

గుంతకల్లుటౌన్: పట్టణంలోని పురాతనమైన కోదండరామస్వామి ఆలయంలో హుండీ కానుకలు లెక్కింపు ద్వారా రూ.59,568 ఆదాయం లభించినట్లు ఈఓ మఠం మల్లికార్జున తెలిపారు. శనివారం దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ కె.రాణి పర్యవేక్షణలో జరిగిన హుండీ లెక్కింపు కార్యక్రమంలో అర్చకులు, ఆర్టీసీ సేవాసమితి, భక్తులు పాల్గొన్నారు. అలాగే రాతిగుడి రామలింగేశ్వర స్వామి ఆలయంలో హుండీ కానుకల లెక్కింపు ద్వారా రూ.25,267 ఆదాయం లభించినట్లు ఈఓ తెలిపారు.

రీ సర్వే సద్వినియోగం చేసుకోండి

పామిడి: భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం నిర్వహిస్తున్న రీ సర్వే ఫేజ్–2 ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సర్వే అండ్ ల్యాండ్స్ ఏడీ రూప్లానాయక్ కోరారు. శనివారం మండలంలోని గజరాంపల్లిలో తహసీల్దార్ శ్రీధరమూర్తి ఆధ్వర్యంలో రీ సర్వేపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏడీ మాట్లాడుతూ రీ సర్వే ఫేజ్–2 కింద గజరాంపల్లి, అక్కజాంపల్లి ఎంపికయ్యాయన్నారు. అనంతరం రీ సర్వేపై రైతులకు ఉన్న అనుమానాలు, సందేహాలను ఆయన నివృత్తి చేశారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ విజయ్, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉరుసుకు ప్రత్యేక బస్సులు

తాడిపత్రి రూరల్: మండలంలోని తలారి చెరువు వద్ద వెలసిన హాజీవలి దర్గా ఉరుసుకు ప్రత్యేకంగా బస్సులను నడుపుతున్నామని ఆర్టీసీ డీఎం శంకర్ శనివారం తెలిపారు. ఉరుసుకు శుక్రవారం 14 బస్సులు, శనివారం 12 బస్సులను నడిపామన్నారు. భక్తుల సౌకర్యార్థం ఆదివారం మరికొన్ని బస్సులు ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు.

శ్రీరామ నవమి ఉత్సవాలకు కొటేషన్ల ఆహ్వానం

గుంతకల్లుటౌన్: పట్టణంలోని కోదండ రామస్వామి ఆలయంలో ఏప్రిల్ 6 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించే శ్రీరామనవమి ఉత్సవాల సందర్భంగా లైటింగ్ డెకరేషన్, కిరాణా సరుకులు, పూల దండల సరఫరా చేయడానికికు ఆసక్తి కలిగిన కాంట్రాక్టర్ల నుంచి కొటేషన్లు ఆహ్వానిస్తున్నట్లు ఈఓ మఠం మల్లికార్జున శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 28లోగా ఈఓ కార్యాలయంలో కొటేషన్లను అందజేయాలని ఆయన కోరారు.

రేపు వాహనాల వేలం

గుత్తి: పట్టణంలోని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ పోలీసు స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు సోమవారం వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ మోహన్ రెడ్డి తెలిపారు. స్థానిక ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో శనివారం ఆయన మాట్లాడారు. మొత్తం ఆరు వాహనాలు(ఐదు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో)క వేలంవేస్తామన్నారు ఉదయం 10 గంటలకు వేలం ప్రారంభమవుతుందన్నారు.

బైక్ బోల్తా–ఇద్దరికి గాయాలు

గుత్తి: పట్టణ శివారులోని గేట్స్ ఇంజనీరింగ్ కాలేజీ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. గార్లదిన్నెకు చెందిన శ్రీనివాసులు, రాము బైక్‌లో గుత్తికి వస్తుండగా అదుపు తప్పి బోల్తా పడింది. ఇద్దరూ గాయపడ్డారు. స్థానికులు వారిని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తిపై దాడి

తాడిపత్రిటౌన్ (యాడికి): యాడికి మండలకేంద్రంలో మార్కెట్ వద్ద నివాసం ఉంటున్న వెంకటశివుడుపై అదే కాలనీ చెందిన దిలీప్, క్రిష్ణయ్య, ప్రవీణ్ శనివారం దాడికి పాల్పడారు. మూడు నెలల క్రితం వెంకటశివుడు ఇంట్లో బంగారం చోరీకి గురైంది. దీంతో ఆయన అనుమానితుల కింద ఈ ముగ్గురు వ్యక్తుల పేర్లను పోలీసులకు తెలపడంతో వారు కక్ష కట్టి దాడికి పాల్పడినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నడి రోడ్డుపై ఇరువర్గాల ఘర్షణ

గుత్తి: పట్టణంలోని గాంధీ సర్కిల్లో శనివారం ఇరు వర్గాలు నడిరోడ్డుపై కొట్టుకున్నారు. వివరాలు.. కర్ణాటకు చెందిన కారు అనంతపురం వైపు వెళ్తుండగా ఎదురుగా బైక్‌ను ఢీకొంది. దీంతో బైక్‌లో ఉన్న ముగ్గురు యువకులు, కారులో ఉన్న నలుగురు వ్యక్తులు మీది తప్పంటే.. మీది తప్పంటూ నడిరోడ్డుపై కొట్టుకున్నారు. ఎస్ఐ ఆశా బేగం పోలీసు సిబ్బందితో అక్కడకు వెళ్లి.. ఇరు వర్గాలను పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి కేసు నమోదు చేశారు.

యువతి ఆత్మహత్యాయత్నం

గుత్తి రూరల్: మండలంలోని వన్నేదొడ్డి గ్రామానికి చెందిన సింధు అనే యువతి శనివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసుల వివరాలిలా ఉన్నాయి. సింధు కొన్ని రోజులుగా కుటుంబసమస్యలతో బాధ పడుతుండేది. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురైన యువతి ఇంట్లో ఎవరూ లేని సమయంలో విష ద్రావకం తాగింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఆమెను గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.


ముస్తాబైన శ్రీవారి రథం (ఫైల్)

రారండోయ్ వేడుక చూద్దాం

• నేడు వేంకటేశ్వరస్వామి రథోత్సవం • ఏర్పాట్లు పూర్తి


పూజలందుకుంటున్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరుడు


వేంకటేశ్వరుడి ఆలయం

యల్లనూరు: మండల కేంద్రంలో లక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రథోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. ఇప్పటికే రథాన్ని నీటితో శుభ్రం చేసి సిద్ధం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, దేవదాయ అధికారులు అన్ని ఏర్పాట్లు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. శనివారం వేంకటేశ్వరస్వామికి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి శ్రీదేవి భూదేవి, వేంకటేశ్వర స్వామి ఉత్స విగ్రహాలను రథంలో ప్రతిష్టించి ఊరేగిస్తారు. వేంకటేశ్వర స్వామి దేవాలయం నుంచి మైన్‌రోడ్డు మీదుగా జెడ్పీ హైస్కూల్, పెద్దమ్మ గుడి మీదుగా పాతపేటకు రథం వెళ్లి అక్కడ నుంచి వెనుతిరిగి.. మళ్లీ స్వామి వారి రథం ఆలయం వద్దకు చేరుకుంటుంది.

ప్రత్యేక ఏర్పాట్లు

వేంకటేశ్వరస్వామి రథాన్ని రథోత్సవం రోజు పురవీధుల్లో తిరిగి పాతపేటలో నిలుపుతారు. అనంతరం ఉగాది (పార్వ) రోజు రథాన్ని తిరిగి ఆలయానికి తీసుకెళ్తారు. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యుత్ స్తంభాలు, నూతన గృహాలు ఏర్పడటంతో రథం తిరగడానికి ఆటంకంగా ఉంది. దీంతో గత ఐదారేళ్ల నుంచి రథోత్సవం కార్యక్రమంలో మార్పులు జరిగాయి. పాత తేరు శిథిలావస్థకు చేరుకోవడంతో మాజీ సర్పంచు కొత్తమిద్దె ఓబులేసు, ప్రజల ఆధ్వర్యంలో నూతన రథాన్ని ఏర్పాటు చేయించారు. ఈ నూతన రథం రథోత్సవం రోజు గ్రామమంతా ఊరేగింపుగా తిరిగి రాత్రికి ఆలయం చేరుకుంటుంది.

పోలీసుల పర్యవేక్షణలో యల్లనూరు

తిరుమల తిరుపతిలో శ్రీవారి బ్రహ్మోత్సవాల తరువాత యల్లనూరులో అదే తరహాలో బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు కమిటీ సభ్యులు, దేవదాయశాఖ ఈఓ మురళీకృష్ణ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. ఆదివారం యల్లనూరు పోలీసుల వలయంలో ఉంటుంది. బ్రహ్మోత్సవాల సందర్భంగా అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు, పుట్లూరు సీఐ సత్యబాబు, యల్లనూరు ఎస్ఐ రామాంజనేయరెడ్డి ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. ఉత్సవాల్లో చోరీలకు, ఘర్షణలకు పాల్పడితే వారిపై కేసులు నమోదు చేస్తామని డీఎస్పీ హెచ్చరించారు. డీఎస్పీ పర్యవేక్షణలో ఇద్దరు ఎస్ఐలు, 20 మంది పోలీసు సిబ్బంది పాల్గొంటారు.

కమనీయం... శ్రీనివాస కల్యాణం

యల్లనూరు: మండల కేంద్రంలో లక్ష్మీ వెంకటేశ్వర స్వామి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ, డప్పుల వాయిద్యాల మధ్య శ్రీవారి, భూదేవి, శ్రీదేవి కల్యాణం కనుల పండువగా సాగింది. శనివారం రాత్రి గజవాహనంపై ఊరేగింపు చేశారు. భక్తులు భారీగా హాజరై స్వామి సేవలో పాల్గొన్నారు. రాత్రి ఆర్కెస్ట్రా కార్యక్రమం నిర్వహించారు.


భూదేవి, శ్రీదేవి సమేత శ్రీనివాసుడికి కళ్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం